**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467



గురువారం 27.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -143 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00


## లోక్‌సభ స్పీకర్‌గా రెండో సారి ఓంబిర్లా ఎన్నిక



**ఢిల్లీ :** లోక్ సభ స్పీకర్ పదవికి జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి ఓం బిర్లా గెలుపొందారు. 18వ లోక్ సభ స్పీకర్ గా ఓం బిర్లా ఎన్నికయ్యారు. మూజు వాణీ ఓటుతో ఆయన గెలుపొంది నట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మర్యాదపూర్వకంగా ఓం బిర్లాను స్పీకర్ చైర్ వరకు తోడ్కొని వెళ్లారు. స్పీకర్ చైర్ లో కూర్చుని వరుసగా రెండోసారి ఆయన బాధ్యతలు చేపట్టారు.
రాజస్థాన్ లోని కోటా లోక్ సభ నియోజకవర్గం నుంచి ఓం బిర్లా ఎంపీగా ఎన్నికయ్యారు. వరుసగా అక్కడి నుంచే మూడోసారి గెలిచి సభలో అడుగుపెట్టారు. 17వ లోక్ సభ స్పీకర్ గా సేవలందించారు. కాగా, డిప్యూటీ స్పీకర్ లేకుండా ఐదేళ్ల పాటు పనిచేసిన స్పీకర్ గా ఓం బిర్లా రికార్డులకెక్కారు. గత ప్రభుత్వంలో ఎన్డీఏ కూటమి డిప్యూటీ స్పీకర్ ను ఎన్నుకోలేదనే విషయం తెలిసిందే. మరోవైపు, స్పీకర్ గా ఎన్నికైన ఓం బిర్లాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్ష నేత రాహుల్ సహా సభ్యులంతా ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఇంకెన్ని అరాచకాలు చేస్తారు ?

○ పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాజీ మంత్రి పేర్ని నానిపై గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ భవన నిర్మాణాలపై అధికార టీడీపీ, విపక్ష వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పేర్ని నాని సీఎం చంద్రబాబుపై పలు ఆరోపణలు చేశారు. పేర్ని నాని చేసిన ఆరోపణలపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రంగా స్పందించారు. ఐదేళ్లు రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడిన వైసీపీ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదన్నారు. వై నాట్ 175 అన్న జగన్ ఉన్నది ఊడగొట్టుకుని వచ్చే ఐదేళ్లలో జరిగే ఎన్నికల గురించి మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మచిలీపట్నంలో పేర్ని నానికి ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు లేకుండా పిచ్చి పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. ఐదేళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేర్ని నాని చేసిన అవినీతిని ప్రజల ముందుపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పేర్ని నాని ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోకపోతే మచిలీపట్నం నుండి తరిమికొడతామని హెచ్చరించారు.

## వైసీపీ కార్యాలయాల కూల్చివేతలపై స్టేటస్ కో

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** వైసీపీ కార్యాలయాల కూల్చివేత ఏపీ రాజకీయాల్లో కాకరేపుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పలుచోట్ల వైసీపీ కార్యాలయాలను అధికారులు కూల్చివేశారు. మరికొన్ని చోట్ల అనుమతులు లేకుండా నిర్మించారంటూ వైసీపీ ఆఫీస్లకు అధికారులు నోటీసులు ఇచ్చారు. దీనిపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నేతలకు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ కార్యాలయాలను కూల్చడం, నోటీసులు ఇవ్వడంపై వైసీపీ హై కోర్టును ఆశ్రయించింది. వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం 10 జిల్లా కార్యాలయాలకు సంబంధించిన కూల్చివేతలు, నోటీసుల గురించి వైసీపీ పిటిషన్లో ప్రస్తావించారు.
ఈ పిటిషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది. వైసీపీ కార్యాలయాల కూల్చివేతలకు ప్రభుత్వం సిద్ధమైందని ఆ పార్టీ తరుపు లాయర్ వాదించారు. తాను ప్రభుత్వం నుండి వివరణ తీసుకున్నా తర్వాత కోర్టుకు సమాచారం ఇస్తామని ప్రభుత్వ తరుఫు న్యాయవాది తెలిపారు. ఇప్పటికిప్పుడు వైసీపీ కార్యాలయాలు కూల్చివేయడం లేదని, అనుమతులు లేకుండా నిర్మించడంతో నోటీసులు మాత్రమే ఇచ్చామని పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కేసు విచారణను రేపటికి వాయిదా వేసింది. అప్పటి వరకు వైసీపీ కార్యాలయాల కూల్చివేతలపై స్టేటస్ కో పాటించాలని ఆదేశించింది.



## మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్

వివరాలు 2 లో

# పేదరిక నిర్మూలనకు శ్రీకారం

- సింపుల్ గవర్నమెంట్....ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం
- రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నుండే కార్యాచరణ
- కుప్పం అభివృద్ధికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు కనిపించకూడదు
- రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు రౌడీ షీట్లు ఎత్తేవేయండి
- గత అడ్మినిస్ట్రేషన్ కు...ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉంటుంది
- సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం
- అధికారులు ఫిజికల్...వర్చువల్ పని విధానాలకు సిద్ధపడాలి
- రానున్న రోజుల్లో కుప్పంలో అమలు చేయబోయే ప్రణాళికపై అధికారులు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**కుప్పం ( జర్నలిస్ట్ ఫైల్ ):** పేదరిక నిర్మూలనకు కుప్పం నియోజకవర్గం నుండే శ్రీకారం చుట్టబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదరికం లేని సమాజం కోసం వేసే తొలి అడుగు కుప్పం నుంచే మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. పేదరికం లేని గ్రామం... పేదరికం లేని మండలం... పేదరికం లేని నియోజకవర్గంగా ముందు కుప్పాన్ని తయారు చేస్తాం అన్నారు. దీని కోసం ఒక ప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. సింపుల్ గవర్నమెంట్...ఎఫెక్టివ్ గవర్నెన్స్ తన విధానమని అధికారులకు తెలియజేశారు. గత అడ్మినిస్ట్రేషన్ కు...ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉండబోతోంది అని సీఎం అన్నారు. అధికారులు ఫిజికల్...వర్చ్యువల్ పని విధానాలకు సిద్ధపడాలి అని అన్నారు. బలవంతపు జనసమీకరణతో పెద్ద పెద్దమీటింగ్ లు, భారీ కాన్వాయ్ లతో సైరన్ల మోతతో హంగామాలు తమ ప్రభుత్వంలో ఉండవని చెప్పారు. సాయంత్రం 6 గంటల తర్వాత సమావేశాలు వద్దని మంత్రులకు కూడా ఇప్పటికే చెప్పాను అన్నారు. అధికారుల కూడా ఫాస్ట్ గా రియాక్ట్ అవ్వాలి...ఎఫెక్టివ్ గా కార్యక్రమాలు ఉండాలి అని సీఎం సూచించారు. కుప్పం అతిథి గృహంలో చిత్తూరు జిల్లా, నియోజకవర్గ అధికారులతో బుధవారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో అమలు చేయబోయే ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కుప్పం సమగ్ర అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. తన ప్రాధాన్యం, ఆలోచనలు, నిర్ణయాలకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. సమీక్షలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..."కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎట్టి పరిస్థితుల్లో కనిపించకూడదు. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు రౌడీ షీట్లు ఎత్తి వేయండి...రౌడీయిజం చేసేవారి పట్ల పోలీసులు కఠినంగా

2 లో

## స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ను ఊడ్చేశారు

- ○ గత ప్రభుత్వం ఖాతాలో మిగిల్చింది రూ.7 కోట్లు మాత్రమే
- ○ అయిదు నెలల జీతాలకు మాత్రమే సరిపోతాయి
- ○ 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.2092 కోట్లు నిధి ఉంటే... ఇప్పుడు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది?
- ○ కార్పొరేషన్ నిధులు ఎటు మళ్లించారు?
- ○ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలపై సమీక్షలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విస్మయం



2లో

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ద్విచక్రవాహనం నడిపే వారందరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరంటూ ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హెల్మెట్ ధరించని పక్షంలో పోలీసులు కేసులు నమోదు చేయవచ్చని తేల్చి చెప్పింది. రాష్ట్రంలో అనేక మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారని.. హెల్మెట్ లేకపోవడం కూడా మరణాలకు కారణమంటూ హైకోర్టులో న్యాయవాది తాండవ యోగేశ్ పిటిషన్ వేశారు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. బైక్ నడిపే వారికి హెల్మెట్ తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు తనిఖీలు చేసే సమయంలో తప్పనిసరిగా బాడీ కెమెరా ధరించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల్లో పేర్కొన్నారు.

## జగన్ గారూ..
## మీకు ప్రతిపక్ష నేత హెూదా రాదు

- ◆ శాసనసభ నిభంధనలను తెలుసుకోండి
- ◆ ప్రతిపక్ష నాయకుడిగా హెూదా కావాలని స్పీకర్‌కు లేఖ రాయడాన్ని తప్పుపట్టిన శాసనసభా వ్యవహారాల మంత్రి
- ◆ ప్రతిపక్ష నేత కావడం తన హక్కు అనే తరహాలో లేఖ రాయడమేంటి ?
- ◆ స్పీకర్‌కు లేఖ రాయాలని జగన్‌కు సూచించిన సలహాదారుల్ని మార్చాలని ఎద్దేవా
- ◆ మీ కెసిఆర్ కూడా తెలంగాణ అసెంబ్లీ లో కాంగ్రెస్ కు ప్రతిపక్ష హెూదా ఇవ్వలేదు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ శాసన సభలో అన్ని పార్టీల తరహాలోనే జగన్మోహన్ రెడ్డిని కూడా ఫ్లోర్ లీడర్‌గానే పరిగణిస్తారని శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. తనకు ప్రతిపక్ష నాయకుడిగా హెూదా కావాలని జగన్ స్పీకర్‌కు లేఖ రాయడాన్ని పయ్యావుల తప్పు పట్టారు. 1994 నుంచి తాను శాసనసభ్యుడిగా ఉన్నానని అప్పట్లో కోట్ల విజయ భాస్కర్ రెడ్డిని సిఎల్పీ నాయకుడిగా ఎన్నుకున్న సమయంలో ఎంపిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీకి ఎందుకు వచ్చారో, పిజెఆర్ విషయంలో ఏమి జరిగిందో కూడా తనకు గుర్తుందన్నారు. చరిత్ర తెలియకపోతే తెలుసుకోవాలని సూచించారు. స్పీకర్‌కు లేఖ రాయాలని జగన్‌కు సూచించిన సలహాదారుల్ని మార్చాలని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. జగన్‌కు ప్రతిపక్ష నేత హెూదా ఇచ్చే అవకాశం లేదని పయ్యావుల చెప్పారు. ప్రతిపక్ష నేత హెూదా రావడానికి జగన్ కు ఓ పదేళ్లు పడుతుందన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హెూదా రావడానికి పదేళ్లు పట్టిందని, 2014, 2019లో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హెూదా కూడా రాలేదని, పదేళ్ల తర్వాత వచ్చిందని గుర్తు చేశారు. జగన్‌కు కూడా ప్రతిపక్ష హెూదా రావాలంటే కనీసం పదేళ్లు పడుతుందని కేశవ్ ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ఆప్తుడైన కెసిఆర్ కూడా తెలంగాణ అసెంబ్లీ లో కాంగ్రెస్ కు ప్రతిపక్ష హెూదా ఇవ్వలేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ సభ్యులుగానే కొనసాగించి పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించారన్నారు. తాము అలాంటి దుర్మార్గపు రాజకీయాలు చేయబోమన్నారు. స్పీకర్‌కు లేఖ రాయడం ద్వారా జగన్ బెదిరించే ప్రయత్నం చేశారని, జగన్ తన ఖాతా పుస్తకాలతో పాటు శాసనసభ నిబంధనలు కూడా చదవాలన్నారు. సభలో అధికార పార్టీ చాలా హుందాగానే వ్యవహరించిందని, ప్రతిపక్ష నేత కావడం తన హక్కు అనే తరహాలో లేఖ రాయడం ఏమిటని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు.

## అతిసారతో రెండేళ్ల చిన్నారి మృతి



**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ లో పలు జిల్లాలో విజృంభిస్తున్న అతిసారతో రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం, కాట్రపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల జగ్గయ్యపేటలో తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టు అర్ధంతరంగా ఆగిపోవడంతో నీరు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడటంతో అతిసార విజృంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 49 పట్టణాల్లోనే ఇదే రకమైన పరిస్థితి ఉన్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వానికి ఇటీవల రాష్ట్ర అధికారులు రాసిన లేఖలో 'ప్రజల భద్రతకు ముప్పు' పొంచి ఉందని పేర్కొన్నారు. అతిసార మరణాలను నిలువరించడంలో ప్రభుత్వాలు, అధికారులు మరింత వేగవంతంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత



**కడప (జర్నలిస్ట్ ఫైల్):** సాంఘీక సంక్షేమ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడప జిల్లా ముద్దనూరు మండలంలో బుధవారం స్థానిక సాంఘీక సంక్షేమ వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో భాగంగా విద్యార్థులకు ఇడ్లి, సాంబారు ఏర్పాటు చేశారు. హాస్టల్లో 28 మంది విద్యార్థులు అల్పాహారం తిన్నారు. వీరిలో 8మంది అస్వస్థత గురయ్యారు. యశ్వంత్, బన్నీ, వెంకటేష్, సతీష్, లక్ష్మి నరసింహులు, సుశాంత్, పెంచల్ నరసింహులు, నాగేంద్ర కడుపు నొప్పి, వాంతులై అస్వస్థతకు గురయ్యారు. యశ్వంత్, బన్నీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆర్డీఓ నరసింహులు హాస్టల్ వద్దకు చేరుకుని వంట గది, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో అధికారులతో మాట్లాడారు. ఉడకని ఇడ్లి, సాంబారులో కుళ్ళిన కూరగాయలు ఉడకని కంది బ్యాళ్లు తిని వాంతులు, కడుపు నొప్పి బారిన పడ్డామని విద్యార్థులు ఆర్డీఓతో ఆవేదన వ్యక్తం చేశారు. అల్పాహారం, భోజనం, కూరలు రుచికరంగా ఉండవని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ అల్పాహారం, నీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. నీటి క్యాన్లతో నీటి సదుపాయం కల్పించాలని వార్డెన్ మనోహర్ కు ఆదేశించారు. ప్రతి రోజు హాస్టల్ తనిఖీ చేయాలని విఆర్ఒకు సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని, నీరు అందించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి పరిశీలించారు. పిహెచ్ సి వైద్యులు కరిష్మా, శ్రీకాంత్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపిడిఓ చంద్ర మౌలీశ్వర్, సిఐ దస్తగిరి, డిటి సౌజన్య పరిశీలించారు

## మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారు. ఈవీఎంల ధ్వంసం, ఎన్నికల్లో అల్లర్లు, ఓ సీఐపై హత్యాయత్నం, మహిళపై బెదిరింపుల కేసులో పోలీసులు బుధవారం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట ఎస్పీ ఆఫీసు పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తరలించారు. ఎస్పీ కార్యాలయంలో విచారించిన అనంతరం పిన్నెల్లిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఏపీ హైకోర్టులో పిన్నెల్లికి భారీ షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఈవీఎంల ధ్వంసం, ఎన్నికల్లో అల్లర్లు, ఓ సీఐపై హత్యాయత్నం, మహిళపై బెదిరింపుల కేసులో అరెస్ట్ నుండి రక్షణ కోరుతూ పిన్నెల్లి దాఖలు చేసిన నాలుగు ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు బుధవారం కొట్టేసింది.

పోలీసుల తరఫున స్పెషల్ కౌన్సిల్ న్యాయవాది ఎన్. అశ్వినీకుమార్ వాదించగా.. ఫిర్యాదుదారు నంబూరి శేషగిరిరావు తరఫున లాయర్ పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. పిన్నెల్లి ముందస్తు బెయిల్ పిటిషన్లు తోసిపుచ్చింది. పిన్నెల్లిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిన్నెల్లి ముందస్తు బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టేసిన నిమిషాల్లోనే పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. కాగా, మే 13 జరిగిన ఎన్నికల్లో ఓ పోలింగ్ బూత్కు వెళ్లిన పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ వీడియో సోషల్ మీడియాలో సంచలనం రేపింది. ఈ ఘటనపై సీరియస్ అయిన ఎన్నికల కమిషన్ పిన్నెల్లిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది.

ఈసీ ఆదేశాల మేరకు పోలీసులు పిన్నెల్లిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా.. ఆయన దాదాపు వారం రోజుల పాటు పరారీలో ఉండి.. కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ల దాఖలు చేశారు. పిన్నెల్లిపై ఎలాంటి చర్యలు తీసుకొవద్దని న్యాయస్థానం పోలీసులను ఆదేశించడంతో తిరిగి మాచర్లకు వచ్చారు. ఈ క్రమంలో ఇవాళ పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు నాలుగు ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేసింది. దీంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. పిన్నెల్లి అరెస్ట్ నేపథ్యంలో మాచర్లలో హై టెన్షన్ నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గిరిజన ప్రాంతాల్లో మహిళా చట్టాలపై అవగాహన



**● ప్రాజెక్ట్ రూపకల్పనకు 'మహిళా కమిషన్' కసరత్తు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గిరిజన ప్రాంతాలలో మహిళల చట్టాలపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని మహిళా కమిషన్ తీర్మానించింది. బుధవారం మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్ పర్సన్ శ్రీమతి గజ్జల వెంకట లక్ష్మి అధ్యక్షతన త్రైమాసిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమిషన్ సభ్యులు కుమారి గద్దం ఉమా, శ్రీమతి బూసి వినీత, కమిషన్ కార్యదర్శి శ్రీమతి వసంత బాల హాజరయ్యారు. ఇటీవల జాతీయ మహిళా కమిషన్ అంతర్జాతీయ సదస్సులో గిరిజన ప్రాంత మహిళల ఆరోగ్యం పై నివేదించిన అంశాలమేరకు ప్రాజెక్ట్ ను చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి సభ్యులకు వివరించారు.

గిరిజన ప్రాంతాల సందర్శన, అక్కడ నిర్వహించా ల్సిన సదస్సులపై చర్చించారు. బసివిని, జోగిని, మాతంగి వంటి అనాగరిక ఆచారాలపై కమిషన్ సభ్యులు ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని నిరోధించాలన్నారు. గత మూడు నెలల్లో కమిషన్ దృష్టికి వచ్చిన ఫిర్యాదులు, ఆయా కేసుల స్థితిపై సమీక్షించారు. సభ్యులకు కేటాయించిన ప్రాంతాల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం పై కమిషన్ శరవేగంగా స్పందించాలన్నారు. కేసుల విచారణకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు ఎప్పటికప్పుడు అందజేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. కార్యదర్శి శ్రీమతి వసంత బాల మాట్లాడుతూ హర్యానాలో జరిగిన జాతీయ మహిళా కమిషన్ సదస్సులో ప్రస్తావించిన ఉమెన్ సేఫ్టీ ఆడిట్ ను వివరించారు. కమిషన్ సభ్యులు ప్రతినెలా వారికి కేటాయించిన ప్రాంతాలలో చేపట్టే కార్యక్రమాల వివరాలను కమిషన్ కార్యాలయానికి పంపాల్సిందిగా కోరారు. సమావేశంలో కమిషన్ సెక్షన్ ఆఫీసర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ను ఊడ్చేశారు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** 2020-21 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఖాతాలో రూ. 2092.65 కోట్ల నిధులు ఉంటే ప్రస్తుతం కేవలం రూ. 7 కోట్లు మాత్రమే మిగిల్చారా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్. డబ్ల్యూ. ఎస్., పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విస్తుపోయారు. బుధవారం మంగళగిరిలోని నివాసంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలు, కార్పొరేషన్ కు ఉన్న నిధులు, రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పాలన సమయంలో కార్పొరేషన్ నిధులు మళ్లింపు అంశంపై చర్చించారు. 2020-21లో రూ. 728.35 కోట్లు మాత్రమే ఈ కార్పొరేషన్ వినియోగించింది. 2021-22లో రూ. 508 కోట్లు ఖర్చు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ. 1066.36 కోట్లు ఖాతాలో ఉన్నాయి. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయ్యేనాటి కార్పొరేషన్ ఖాతాలో రూ. 3 కోట్లు మాత్రమే ఉన్నాయని రికార్డుల్లో నమోదు అయింది. దీనిపై వివరణ ఇవ్వాలని, నిధులు ఎటు వెళ్ళాయి, ఏం చేశారో సవివరంగా పేర్కొనాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు నిధులు అందించింది. రూ. 46 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, వాటిపై వచ్చిన వడ్డీతో రూ. 239 కోట్లు నిధులు సమకూరాయి. ఖర్చు రూ. 209 కోట్లు మేర చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ మిగిలినవి రూ. 7.04 కోట్లు మాత్రమే.

**స్వచ్ఛాంధ్ర నిధులనూ వదల్లేదు**

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు సక్రమంగా వినియోగమయితేనే ఈ సంస్థకు నిర్దేశించిన లక్ష్యాలు అందుకోగలమని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సదుద్దేశంతో, ప్రజారోగ్యం కోసం స్వచ్ఛ భారత్ మిషన్ తీసుకువచ్చారని అందులో భాగంగానే స్వచ్ఛాంధ్ర ఏర్పాటైందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులను నెలల తరబడి బ్యాంకు ఖాతాల్లో ఉంచడం, ఆ నిధుల ద్వారా వడ్డీ కూడా లభిస్తున్నా వినియోగించకుండా- ఆపైన ఇతర అవసరాలకు మళ్లించడం అనేది గత ప్రభుత్వ పాలకులు చేసిన ఓ దురదృష్టకర ప్రక్రియ అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. అందుకు 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి కార్పొరేషన్ ఖాతాలో కేవలం రూ. 3 కోట్లు మిగల్చడమే ఉదాహరణ అన్నారు. దీన్నిబట్టే వైసీపీ పాలకులు నిధుల మళ్లింపు ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యాలను గాలికొదిలేసి, వ్యవస్థలను నిర్వీర్యం చేసేశారని పవన్ కళ్యాణ్ చెప్పారు.

2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 2092 కోట్లు నిధి ఉంటే... ఇప్పుడు జీతాలకు సరిపడా నిధులు మాత్రమే ఖాతాలో ఉండే పరిస్థితి ఎందుకు వచ్చింది? అని అధికారులను ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లో నిధుల మళ్లింపుపై మరింత లోతుగా సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు ఎటు మళ్లించారో, ఎవరి ఆదేశాలతో ఆ పని చేశారో కూడా తెలియచేయాలని, గత అయిదేళ్లలో ఈ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను సమగ్రంగా చర్చిద్దామని అధికారులకు ఉప ముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్.డి., ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డయేరియా బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

**● మంచి వైద్య సేవలు అందిస్తున్నారంటూ వైద్యులు, సిబ్బందికి ప్రశంసలు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఆసుపత్రి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను బుధవారం తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులను ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రత్యేక వార్డులో చేర్పించి వైద్య సేవలను అందిస్తున్నారని ఆయన చెప్పారు.. మాచర్ల , చుట్టూ ప్రాంతాల తో పాటు నగర పరిధి లో ఉన్న వారంతా పాయిజన్ ఫుడ్ తీసుకోవడం వల్ల అస్వస్థత కు గురయ్యారని ఆయన తెలిపారు. డయేరియా బాధితుల ను స్వయంగా అడిగి తెలుసుకున్నానని ఆయన చెప్పారు.

అదే విధంగా వైద్య సేవలు కూడా వెంటనే అందించాల్సిందిగా ఆదేశించినట్లు ఆయన చెప్పారు. బాధితులందరికీ వైద్య సేవలు అందిస్తున్నామని ఆరోగ్య విషయం లో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అయన చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తూ బాధితులకు వైద్యం అందించాలని ఆదేశించినట్లు అయన తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎక్కడ లోపాలు జరుగుతున్నాయో క్షుణ్ణంగా పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేస్తామని అయన తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన డయేరియా బాధితులను బుధవారం తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ పరామర్శించారు. ఈ సందర్భంగా నసీర్ అహమద్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులను అడ్వాన్స్డ్ ఐ సి యు వార్డులో మంచి వైద్య సేవలను డాక్టర్ కిరణ్ కుమార్ అందిస్తున్నారని చెప్పారు. మాచర్ల , చుట్టూ ప్రాంతాల తో పాటు నగర పరిధి లో ఉన్న వారంతా పాయిజన్ ఫుడ్ తీసుకోవడం వల్ల అస్వస్థత కు గురయ్యారని ఆయన తెలిపారు. డయేరియా బాధితుల ను స్వయంగా అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా వైద్య సేవలు కూడా వెంటనే అందించాల్సిందిగా ఆదేశించినట్లు ఆయన చెప్పారు.


బాధితులందరికీ వైద్య సేవలు అందిస్తున్నామని ఎవరకి ఎలాంటి ఆరోగ్య విషయం లో భయపడాల్సిన అవసరం లేదని అయన చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తూ బాధితులకు వైద్యం అందించాలని ఆదేశించినట్లు అయన తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ తో చర్చించి సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికారులను అప్రమత్తం చేస్తామని ఆయన అన్నారు. డయేరియా ప్రాంతంలో వాటర్ శాంపిల్స్ సేకరించి పరిశుద్ధమైన నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. శానిటేషన్ సిబ్బంది ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఆయన అన్నారు. డయేరియా బారిన పడకుండా ఉండేందుకు చిన్న పిల్లలకు వ్యాక్సిన్ కూడా చేస్తామని ఆయన తెలిపారు.

బాధితులకు పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తామని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సూదుర ప్రాంతాల నుంచి డేయేరియా బాధితులు ఆసుపత్రికి వస్తున్నారన్నారు. కొంతమంది కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న వారిని ఐ సి యు లో చేర్పించి వైద్యం అందిస్తున్నామని ఆయన అన్నారు. ఇంతవరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సీజనల్ వ్యాధులు ఉండటం వల్ల,సక్రమైన ఫుడ్ తీసుకోలేక పోవడం వల్ల కొంతమంది అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన అన్నారు. గతంలో ఒకే ప్రాంతం నుంచి కాకుండా వివిధ ప్రాంతాల నుంచి రావడం వల్ల ఆరోగ్య సమస్యలు తలేత్తున్నాయని ఆయన తెలిపారు. ఆసుపత్రి కి వచ్చిన బాధితులకు అండగా ఉంటూ వైద్య సేవలు కల్పిస్తామని ఆయన చెప్పారు.

# ప్లే స్కూళ్లపై నియంత్రణ ఏది ?

**● బాపట్ల జిల్లా ఎల్ కేజీ,, యుకేజీ పేరుతో అధిక ఫీజులు**

**● అనుమతులు లేని ప్లేస్కూళ్ళ చర్యలు తీసుకోని జిల్లా విద్యా శాఖ**



**చీరాల,( జర్నలిస్ట్ ఫైల్ ):** చీరాల పట్టణంలో ప్లే స్కూల్ , యజమాని ఎల్ కేజీ, యుకేజీ పేరుతో పసి పిల్లల తల్లి తండ్రుల దగ్గర వేలల్లో అధిక ఫీజులు వసూళ్ళకు పాల్పడుతున్న స్కూలు యాజమాన్యాలపై జిల్లా విద్యా శాఖ అధికారులు చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను వ్యాపారం చేస్తున్న స్కూల్స్ పైన సంబంధిత జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ బాపట్ల జిల్లా విద్యా శాఖ అధికారులు మాత్రం విద్యను వ్యాపారం చేస్తున్న వారి పైన నేటి వరకు కూడ చర్యలు తీసుకోకపోవటానికి కారణాలు ఏమిటి..? సామాన్య పేద మధ్యతరగతి పిల్లలను ప్లే స్కూల్లో జాయిన్ చేసుకునే ఆర్థిక స్తోమత అందుబాటులో లేదు అని పట్టణంలోని ప్రజలు మరియు పసిపిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చిన్న పిల్లల ఒక పాఠశాలకు షాడో భాగస్వామి గా ఓ పత్రిక విలేకరి ఉండి. మండల విద్యా శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా అంత నేనే అంటూ పాఠశాలను నిర్వహిస్తున్నారని స్థానికుల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ప్లే స్కూల్ పైన వివరణ అడిగిన ఇతర మీడియా సంస్థల విలేకరులు పాఠశాల యాజమాన్యాన్ని వివరణ అడిగితే పాఠశాల నడుపుతున్న యజమాని షాడో భాగస్వామి రంగంలోకి దిగుతాడని, ఇంకేముంది యాజమాన్యంతో షాడో భాగస్వామి పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనుమతులు లేకుండా పాఠశాలను నిర్వహించడం పెద్ద నేరమైతే ఇటు విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తూ అటు విద్యాశాఖను మేనేజ్ చేస్తూ మరొక వైపు తప్పుడు కేసులు పెట్టిస్తు పోలీస్ లను సైతం తప్పుదోవ పట్టిస్తున్నాడంటే ఏ స్థాయిలో మేధావితనాన్ని ఉపయోగిస్తున్నారో ఇట్టే అవగతం అవుతుంది అని ఇతర మీడియా వర్గాలు వ్యాఖ్యానిస్తున్నారు జిల్లా పరిధిలో ఇంత జరుగుతున్న జిల్లా విద్యా శాఖ

ఉన్నతాధికారులు స్పందించకు పోవటానికి కారణాలు ఏమిటి విద్యా వ్యాపారమా ...? కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్యా ఉచిత వైద్యం కోసం లక్షల కోట్లు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తూ ప్రతి పేద వారికి కూడా ఉచిత విద్యాని అందించాలి అనే ఒక గొప్ప సంకల్పంతో విద్యా శాఖలో నూతన విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వాలు కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు సైతం, ధిక్కరించి విద్యాని వ్యాపారం చేస్తున్న చీరాల ప్లే స్కూల్ పైన సంబంధిత జిల్లా విద్యా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి అనుమతులు లేను ప్లే స్కూల్ పైన చట్టపరమైన చర్యలు తీసుకొని చట్టం ఎవరి చుట్టం కాదు అని నిరూపించి విద్యాని వ్యాపారం చేస్తున్న వారి పైన తగు చర్యలు తీసుకోవాలి భవిష్యత్తులో మరెవరు సరైన అనుమతులు లేకుండా చిన్నపిల్లల పాఠశాలలను నడపకూడదు అని హెచ్చరిక చేయాలి అని స్థానిక ప్రజలు,పిల్లల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# పేదరిక నిర్మూలనకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించాలి. గత 5 ఏళ్లు అధికారులు మనసు చంపుకుని పనిచేశారు. వైసీపీ నేతల పైశాచిక ఆనందానికి కొందరు అధికారులు సహకరించారు. నా సొంత నియోజకవర్గానికి నేను రాలేని, మాట్లాడలేని పరిస్థితిని గత ఐదేళ్లలో కల్పించారు. నా పైనా హత్యాయత్నం కేసు పెట్టారు. 2019 వరకు నాపై ఒక్క కేసు కూడా లేదు...కానీ గత 5 ఏళ్లలో అక్రమ కేసులు అనేకం పెట్టారు. ప్రభుత్వ వ్యవస్థలు నాశనం అవ్వడంపై నేను చాలా బాధపడ్డాను. కుప్పంలో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం రావాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రణాళికలు సిద్ధం చేయండి..మార్పు కనిపించాలి:** "నియోజకవర్గంలో కొన్ని సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ తాగునీరివ్వడంతో పాటు, హంద్రీనీవా కాల్వ పనులు పూర్తికి ప్రణాళిక సిద్దం చేయండి. వ్యవసాయంలో మెరుగైన విధానాలు తీసుకురావాలి. డైరీ, మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కుప్పానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తాం. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తాం అని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని లెక్కించేందుకు, అవకాశాలు కల్పించేందుకు, వారిలో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు సబ్సిడీలు అందించడం పై దృష్టి పెట్టాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రతి డిపార్ట్మెంట్ నుంచి పక్కా ప్రణాళికతో రావాలని.....నెలల వ్యవధిలోనే కుప్పంలో మార్పు చూపించాలి అని అధికారులకు, సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు.

**ముగిసిన సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన**

రెండు రోజుల పర్యటన నిమిత్తం కుప్పానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం సాయంత్రం అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సాదర వీడ్కోలు పలికారు. ఈనెల 25, 26వ తేదీ లలో రెండు రోజుల పర్యటనను ముగించుకుని బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పీఏఎస్ మెడికల్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెంగళూరుకు హెలికాప్టర్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి, పూతలపట్టు, నగరి, మదనపల్లి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీ మోహన్, భాను ప్రకాష్, షాజహాన్ భాష.. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, నాయకులు చల్లా బాబు, మునిరత్నం, డా.సురేష్, ప్రజాప్రతినిధులు అధికారులు సాదర వీడ్కోలు పలికారు.

**బాబు పర్యటన విజయవంతం**

సార్వత్రిక ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా రెండు రోజుల పర్యటన కోసం కుప్పానికి విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతమైంది. ఎల్లిపాడులో దిగినప్పటి నుంచి తిరిగి హెలికాప్టర్ ఎక్కువ ప్రజలు అడుగడుగున నీరాజనం పలికారు. దారి పొడవునా రోడ్డుపై నిలబడి అభివాదం చేస్తూ ఘన స్వాగతం పలికారు అంతేకాకుండా మహిళలైతే మంగళ హారతులు పలికి పోలో వర్షాన్ని కురిపించారు. జిల్లాకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఏకంగా రూ 4.50 కోట్ల రూపాయలను రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం విరాళంగా అందజేయడం ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది అంతేకాకుండా హెల్ప్ నుంచి కుప్పం పురవీధుల్లో రోడ్డుకిరువైపులా కటౌట్లు భారీ హోర్డింగులు బ్యానర్లతో మొత్తం పసుపు మయంగా కనిపించింది రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

**● ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి**



**చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్):** పీలేరు నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నాయకులకు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఆయన అసెంబ్లీలో శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమ స్వగ్రామం నగిరిపల్లె కు రావడంతో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగిరిపల్లి కి వచ్చిన వివిధ నాయకులు కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వృద్ధులు, వితంతువులకు "ఎన్టీఆర్ భరోసా" పేరుతో ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు మూడువేలు, జులై నెల నాలుగు వేలు మొత్తం ?7,000 రూపాయలతో పాటు నూతన పాస్ బుక్ కూడా లబ్ధిదారులు ఇంటి వద్ద సచివాలయ సిబ్బందితో అందజేస్తామని అన్నారు. ఆగస్టు 1 నుండి యధావిధిగా నాలుగు వేలు పెన్షన్ వస్తుందని అన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చార్జీలు పెంచకుండానే ఆర్టీసీని లాభాల్లోకి తెస్తాం




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** ఏపీలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి భారీ విజయం సాధించి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా చంద్రబాబు సర్కార్ అడుగులు వేస్తోంది. ఏపీ రవాణా శాఖ మంత్రిగా రామ్ ప్రసాద్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో వైసీపీ హయాంలో రవాణా శాఖ నిర్వీర్యమైందని, ఆర్టీసీలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. లీజుల పేరుతో ఆ పార్టీ నేతలు సంస్థ భూములను కాజేశారని, వాటిని తాము వెనక్కితీసుకుంటామని చెప్పారు. ప్రజల సొమ్ము తిన్నవారిని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. తాము ఛార్జీలు పెంచకుండానే బస్సు సర్వీసులు పెంచి మంచి సేవలందిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

## పేదవాడి ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ లక్ష్యం



**ధర్మవరం (జర్నలిస్ట్ ఫైల్):** : నియోజకవర్గంలో గత ఐదేళ్ల పాలనలో కబ్జాలు, భూదందాలు, అక్రమ నిర్మాణాలకు నాయకులు పాల్పడ్డారని, వారి వైఖరిలో మార్పు రాకుంటే తొక్కు పెట్టి నార తీస్తామని, వైసీపీ పార్టీ నాయకులకు టీడీపీ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. బుధవారం ధర్మవరం పట్టణంలో ఆయన అమృత్ పథకం కింద రూ 15 కోట్లతో చేసిన నీటి ట్యాంక్ పనులను, అన్నా క్యాంటీన్లను పరిశీలించారు. అమృత పథకం కింద చేపట్టిన నీటి ట్యాంకు పనులు త్వరితగతిన పనులు చేపట్టాలని కమిషనర్ రామ్ కుమార్కు తెలిపారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పేదవాడి ఆకలి తీర్చాలని లక్ష్యంతో అన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదవాడు కడుపు నింపే క్యాంటీన్ ను మూసివేయడం బాధాకరమన్నారు. అన్న క్యాంటీన్లలో చిన్న రిపేర్లను సరి చేసిన అనంతరం అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి సమస్యలను గుర్తించి మంత్రి సత్య కుమార్ యాదవ్ తో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ధర్మవరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా లక్ష్యమన్నారు. గతంలో పరిటాల రవీంద్ర ధర్మవరంలో ఉన్న అరాచక శక్తుల నుంచి రక్షించి.. శాంతిని ధర్మవరం పట్టణ ప్రజలకు కల్పించారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లోనే అభివృద్ధికి పాటుపడతానని వివరించారు. కబ్జాలు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జీఏడీలో రిపోర్టు చేసిన కలెక్టర్లు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారన్న ఆరోపణల నేపథ్యంలో పలువురు అధికారులపై చంద్రబాబు సర్కార్ వరసగా బదిలీ వేటు వేస్తోంది. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ ఈ బదిలీలు జరుగుతున్నాయి. తాజాగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత , గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిపై బదిలీ వేటు పడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం జీఏడీలో రిపోర్టు చేశారు.

పలువురు ఐఏఎస్‌లను శనివారం రోజున చంద్రబాబు సర్కార్ భారీగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అధికార యంత్రాంగం ప్రక్షాళనలో భాగంగా బదిలీలు చేపట్టారు. ఇందులో అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత, విశాఖ కలెక్టర్ మల్లికార్జున సహా పలువురు ఐఏఎస్‌లు ఉన్నారు. ఈనెల 20న సైతం ఐఏఎస్‌లు శ్రీలక్ష్మి, రజత్ భార్గవ, ప్రవీణ్ ప్రకాశ్, మురళీధర్ రెడ్డికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కన పెట్టారు.

# తెలంగాణ వార్తలు

## గ్రేటర్‌లో కంటోన్మెంట్ ప్రాంతాల విలీనానికి సిద్ధం



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కంటోన్మెంట్ బోర్డుల పరిధిలోని ప్రాంతాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే అంశంపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్ న్యూఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో మంగళవారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కేంద్ర మంత్రికి తెలియజేశారు. బ్రిటిష్ పాలన నుంచి దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర మంత్రి గిరిధర్ ఈ సందర్భంగా తెలిపారు.

## తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నేత ఏపీ జితేందర్ రెడ్డికి కాంగ్రెస్ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఆయన ఈరోజు ఉదయం ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ హక్కుల కోసం కృషి చేస్తానన్నారు. విభజన అంశాల పరిష్కారం, కృష్ణానదిలో సమాన వాటా, రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల సాధన కోసం పని చేస్తానని చెప్పారు. మరోవైపు స్పోర్ట్స్ అడ్వైజర్ గా రాష్ట్రంలో క్రీడా సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని, తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానన్నారు. 2036లో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించే అవకాశం భారత దేశానికి వస్తే.. హైదరాబాద్ లోనూ కొన్ని ఈవెంట్ నిర్వహించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో చిరుత సంచారం..!



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** శంషాబాద్ విమానాశ్రయంలో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. ఎయిర్ పోర్టు పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తోందంటూ విమానాశ్రయ సిబ్బందికి, అధికారులకు, అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించింది. శంషాబాద్ ఘాన్సీమియాగూడలోని సమీపంలో చిరుత నీరు తాగినట్లు ఆనవాళ్లను గుర్తించామని, అయినా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే చిరుత ఆచూకీ కోసం 20 కెమెరాలతో పాటు రెండు బోన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో అడవి పిల్లి కదలికలు కనిపించాయి. చిరుతపులి సంచరిస్తోందనే కలకలం వేళ.. అటవీ అధికారులు బుధవారం మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

# సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మాణం సహా మొత్తం 8 ప్రధాన డిమాండ్లతో విద్యార్థి వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా రెండ్రోజులుగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే.

వారం రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపిన జూడాలు.. సోమవారం నుంచి ఓపీ, ఎలక్టివ్ సర్జరీలను సైతం బహిష్కరించి సమ్మెబాట పట్టారు. వైద్యారోగ్య శాఖ మంత్రితో జరిపిన చర్చలు అసంపూర్ణం కాగా.. డీఎంఈతో చేసిన చర్చలు సైతం విఫలం కావటంతో సమ్మె ఉధృతం చేశారు. అయితే మంగళవారం రాత్రి మరోసారి డీఎంఈ, ఆరోగ్యశాఖ అధికారులతో అర్ధరాత్రి వరకు జూడాల చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో పలు హామీల అమలుకు ప్రభుత్వం వాగ్దానం చేయడంతో సమ్మె తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జూడాలు ప్రకటించారు.

గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో జూడాల వసతి భవనాల నిర్మాణం, వసతి భవనాలకు నిధుల విడుదల, కాకతీయ వర్సిటీలో రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. మరోవైపు ఇవాళ రెండు జీవోలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జూడాలు పేర్కొన్నారు. జీవోలు విడుదల కాకపోతే తిరిగి సమ్మె ప్రారంభిస్తామని హెచ్చరించారు.

## జీవన్ రెడ్డి అలక... తక్షణం హస్తినకు రావాలని అధిష్టానం పిలుపు



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తీవ్ర మనస్తాపానికి గురైన జీవన్ రెడ్డి రాజీనామా చేస్తారనే వార్తలు గుప్పుమన్నాయి. అయితే వెంటనే డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు జీవన్ ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు.. దీంతో ఆయన చల్ల బడ్డారు.. ఈ నేపథ్యంలోనే తాజాగా జీవన్ రెడ్డి ఎపిసోడ్ ఢిల్లీకి చేరుకుంది. ఈ రోజు ఉదయం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ జీవన్ రెడ్డికి ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే ఢిల్లీకి రావాలని ఆదేశించారు. దీంతో ఢిల్లీలో ఉన్న దీపాదాస్ మున్షీని కలిసేందుకు జీవన్ రెడ్డి ఈరోజు మధ్యాహ్నం ఢిల్లీకి బయలు దేరారు.. జీవన్ రెడ్డి ని ఢిల్లీకి పంపించే బాధ్యతలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు అప్పగిస్తూ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ ఆదేశాలు ఇచ్చారు.

మరోవైపు నేడు ఢిల్లీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు వెళ్లనున్నారు. మంత్రివర్గ విస్తరణ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు, ప్రధానంగా జీవన్ రెడ్డి విషయంలో అధిష్టానంతో చర్చించనున్నారు. ఇప్పటికే ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి ఉన్నారు.

# అంజన్న సన్నిధికి..

## 29న రానున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి



**కొండగట్టు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఈనెల 29న కొండగట్టుకు రానున్నారు. గతం లో కొండగట్టు అంజన్న ను దర్శించుకుని, పవన్ కళ్యాణ్ వారాహి వాహనానికి పూజలు నిర్వహించి ఆంధ్రప్రదేశ్ లో పర్యటించిన విషయం విదితమే.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి భారీ విజయం సాధించడం, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. భారీ విజయాన్ని సొంత చేసుకోవడంతో కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించుకొని కొండగట్టు పర్యటనకు శ్రీకారం చుట్టారు. పవన్ రాక కన్ఫామ్ కావడంతో ఆయన అభిమానులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## పోచారం, సంజయ్ లపై అనర్హత వేటు వేయండి



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్‌కు ఫోన్ చేసిన స్పందించకపోవడంతో ఆయన ఈ-మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా వారిపై ఫిర్యాదు చేశారు. వారు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో జగదీశ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన సభ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. ఇదివరకు పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై కూడా ఫిర్యాదు చేశారు.

# జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజ్ చేయాలి



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజ్ చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎస్టేట్ అదనపు కమిషనర్ కోట శ్రీవాత్సవతో ఆమె మంగళవారం సమీక్షించారు. వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలు, ఇతర ఆస్తులు ఎన్ని ఉన్నాయి, వాటికి సంబంధించిన పూర్తి రికార్డులు ఉన్నాయా? అద్దెలు సక్రమంగా వసూలవుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య సముదాయాలు, ఇతర ఆస్తుల ద్వారా ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లీజు గడువు ముగింపునకు సంబంధించి ముందుగా అలర్ట్ వచ్చేలా ఆన్‌లైన్‌లో మార్పులు చేయాలన్నారు. కమ్యూనిటీ హాళ్లపై నివేదిక ఇవ్వాలని సూచించారు. మోడల్ మార్కెట్లలో ఎన్ని దుకాణాలను అద్దెకిచ్చారు..? ఎన్ని ఖాళీగా ఉన్నాయన్న వివరాలూ సమర్పించాలన్నారు.

## బోనాలకు సమన్వయంతో పనిచేయాలి..



హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్ ): బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జూలై 9న ఎల్లమ్మ కల్యాణం జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, స్థానికులతో హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్లమ్మ కల్యాణ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం బోనాలకు రూ. 15 కోట్లు ఇస్తే, ఈ సంవత్సరం దేవాదాయ శాఖ మంత్రి చొరవతో 20 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

# భవిష్యత్తులో భారత్‌ను వెంటాడనున్న నీటి సంక్షోభం : మూడీస్



**ఢిల్లీ :** ఈ ఏడాది దేశ రాజధాని ఢిల్లీలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికితోడు ఆ రాష్ట్రాన్ని నీటి సంక్షోభం వెంటాడుతుంది. దీంతో ఢిల్లీవాసులకు తాగేందుకు నీరులేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే గతంలో కర్ణాటక కూడా తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొంది. దేశంలో ఈ రెండు రాష్ట్రాలే నీటి సమస్యల్ని ఎదుర్కొన్నాయనుకుంటే పొరపాటే. వాతావరణ మార్పుల వల్ల భవిష్యత్తులో భారత్ తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోనుందని తాజాగా మూడీస్ రేటింగ్ కంపెనీ హెచ్చరించింది. భారత్‌లో రానున్న రోజుల్లో తీవ్రస్థాయిలో జలసంక్షోభం పెరగనుంది. దీనివల్ల వినియోగంలో పెరుగుదల, ఆర్థికాభివృద్ధిలోనూ, దేశీయ రుణాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని మూడీస్ హెచ్చరించింది. ముఖ్యంగా నీటి సంక్షోభం వల్ల కంపెనీలు, వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతినే అవకాశముంది. దాని ఫలితంగా ఆహార ధరలు పెరుగుతాయి. వ్యాపార రంగం దెబ్బతింటుంది. మొత్తంగా జలసంక్షోభం వల్ల సమాజంలోనే అశాంతి నెలకొనే ప్రమాదం పొంచి ఉందని మూడీస్ సంస్థ పేర్కొంది.

భారత్‌లో 40 శాతం కంటే ఎక్కువమందే వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు. నీటి సంక్షోభం వల్ల వీరందరిపైనా ఆ ప్రభావం పడే అవకాశం ఉంది. అదేవిధంగా దేశ వృద్ధిలోనూ ఈ సంక్షోభం అస్థిరతను పెంచుతుందని మూడీస్ పేర్కొంది. నీటి ఎద్దడివల్ల బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కంపెనీలు, ఉక్కు కంపెనీలు భవిష్యత్తులో ఎన్నో సమస్యల్ని ఎదుర్కోనున్నాయని, పారిశ్రామిక రంగాన్ని కుదేలు చేసే అవకాశం ఉందని మూడీస్ కంపెనీ పేర్కొంది.

నీటి నిర్వహణలో జి 20 ఆర్థిక వ్యవస్థల్లో భారత్ చాలా వెనుకబడి ఉందని, ఈ సందర్భంగా మూడీస్ గుర్తు చేసింది. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా, పారిశ్రామికీకరణ, పట్టణీకరణలోనూ, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలిచినప్పటికీ అవసరాలకుగుణంగా నీటిలభ్యత లేదు. ఇప్పటికే తలసరి సగటు వార్షిక నీటి లభ్యత తక్కువగా ఉంది. 2021లో తలసరి సగటు వార్షిక నీటి లభ్యత 1,486 క్యూబిక్ మీటర్లుగా ఉంది. ఇది 2031 నాటికి 1,367 క్యూబిక్ మీటర్లకు పడిపోవచ్చని మూడీస్ అంచనా వేసింది. నీటి వనరుల మంత్రిత్వశాఖ ప్రకారం.. 1,700 క్యూబిక్ మీటర్ల కంటే తక్కువస్థాయి నీటి లభ్యత ఉంటే నీటి ఎద్దడిని సూచిస్తుంది. అదే 1,000 క్యూబిక్ మీటర్లుగా ఉంటే నీటి కొరతను సూచిస్తుంది.

భారత్‌లో పర్యావరణ మార్పుల వల్ల ఢిల్లీతోపాటు, ఉత్తరాది రాష్ట్రాల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు భారీ వర్షాలు కురిసి వరదలు పోటెత్తుతున్నాయి. ఇలా అకస్మాత్తుగా వర్షాలు కురిసినా.. వర్షపు నీటిని నిలుపుకోవడానికి సరిపోదు. దీంతో మౌలిక సదుపాయాలకు కూడా ఇబ్బందులేర్పడతాయని మూడీస్ సంస్థ పేర్కొంది.

రుతుపవనాల వర్షపాతం కూడా క్రమేపీ తగ్గుతోందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం) తెలిపింది. 1950-2020 సమయంలో హిందూ మహాసముద్రం శతాబ్దానికి 1.20 డిగ్రీల సెల్సియస్ చొప్పున వేడెక్కింది. 2020-2100 మధ్య కాలంలో 1.7-3.8 డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతుందని ఐఐటీఎం తెలిపింది. సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల బలహీననమైన రుతపవన వర్షపాతం సాధారణంగా మారుతుంది. దీనివల్ల వర్షాలు లేక తరచుగా కరువు పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఐఐటీఎం పేర్కొంది.

# జాతీయ వార్తలు

## బెంగళూరు కోర్టుకు తమిళనాడు మంత్రి ఉదయనిధి హాజరు



**చెన్నై:** సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధికి బెంగళూరు న్యాయస్థానం నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేసింది. నగరంలో గత ఏడాది సెప్టెంబరు 20వ తేది 'సనాతన నిర్మూలన మహానాడు' జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. డెంగ్యూ, మలేరియాల్లానే సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. దీనిపై దేశవ్యాప్తంగా పలు హిందూ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు 8 కేసులు నమోదయ్యాయి. ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ బెంగళూరుకు చెందిన రమేష్ బెంగళూరులోని ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ 8 కేసులు వేర్వేరు రాష్ట్రాల్లో దాఖలైన నేపథ్యంలో, అన్నింటినీ ఒకటిగా చేర్చి ఒకే ప్రాంతంలో విచారించాలని కోరుతూ ఉదయనిధి తరఫున న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ముఖ్యంగా, ఉదయనిధితో పాటు, సనాతన ధర్మ నిర్మూలన మహానాడు ఏర్పాటుచేసిన వెంకటేష్, ఆదవన్, మధుకూర్ రామలింగం తదితరులపై కూడా క్రిమినల్ చర్యలు చేపట్టాలని రమేష్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పఠాన్ కోట్ లో హైఅలర్ట్.. గ్రామాల్లో సంచరిస్తున్న సాయుధ ఉగ్రవాదులు

**పఠాన్‌కోట్ :** భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలో భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో

బుధవారం జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. పలు గ్రామాల్లో దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బోర్డర్ రేంజి డీఐజీ రాకేశ్ కుశాల్ మాట్లాడుతూ గత రాత్రి అనుమానాస్పద కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టినట్లు తెలిపారు. ఇప్పటికే బీఎస్ఎఫ్, సహా అన్ని సెక్యూరిటీ ఏజెన్సీలకు అలర్టు జారీ చేశామన్నారు.

పఠాన్ కోట్ ఎస్ఎస్పీ సుహైల్ ఖాసీం మిర్ ఈ వివరాలను వెల్లడిస్తూ.. "ఇద్దరు సాయుధులు కోట్ భట్టియాన్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించాం. ఈ ప్రాంతం జమ్మూ కశ్మీర్లోని కథువా జిల్లాతో సరిహద్దులు పంచుకొంటోంది. ఈ అనుమానితులే కథువాలోని కోట్ పన్నూలో కూడా సంచరించినట్లు తెలిసింది" అని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన పాక్ నుంచి కథువా జిల్లా సుక్వాల్ గ్రామంలోకి చొరబడిన ఇద్దరు అనుమానితులను భద్రతా దళాలు కాల్చిచంపాయి.

# మాకూ అవకాశం ఇవ్వండి.... స్పీకర్ ఓం బిర్లాతో రాహుల్



**ఢిల్లీ :** 18వ లోక్ సభ స్పీకర్ గా ఓం బిర్లా ఎన్నికైన అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. లోక్‌సభ స్పీకర్ ప్రజల గొంతుకకు మధ్యవర్తి అని, గతం కన్నా ఈ సారి ప్రతిపక్ష ఆ స్వరానికి ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు స్పీకర్ పని చేయడంలో సహకరిస్తాయని, సభ పనిచేయాలని కోరుకుంటున్నామని అన్నారు. సభలో ప్రతిపక్షాల స్వరాన్ని అనుమతించాలని అన్నారు. ప్రతిపక్షాలకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ప్రభుత్వానికి ఎక్కువ రాజకీయ అధికారం ఉందని అలాగే ప్రతిపక్షం కూడా భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని గుర్తు చేశారు.

ప్రతిపక్షాల వాణి ఎంతవరకు వినిపిస్తుందో ఈ సభలో స్పీకర్ నిర్ణయిస్తారని, అయితే రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశ ప్రజలు కట్టుబడి ఉన్నారని ఈ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ప్రజల మద్దతుతో తాము పార్లమెంటులో పూర్తిగా ప్రాతినిధ్యం వహిస్తామని.. వారి రాజ్యాంగ హక్కులను పరిరక్షించడానికి పోరాడుతూనే ఉంటామని రాహుల్ గాంధీ చెప్పారు. ఇదే సందర్భంగా తమ విపక్షాలకు మాట్లాడేందుకు తగిన అవకాశాలు కల్పించాలని కొత్త స్పీకర్ ఓం బిర్లాను కోరారు..

## బెంగళూరులో 3 వారాల్లో వెయ్యికిపైగా డెంగ్యూ కేసులు



**బెంగళూరు :** కర్ణాటక రాజధాని బెంగళూరులో డెంగ్యూ కేసులు కలకలం రేపుతున్నాయి. దీంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. గత మూడు వారాల్లోనే మొత్తం 1,036 కేసులు నమోదవగా, వాటిలో బీబీఎంపీ పరిధిలోనే డెంగ్యూ కేసులు 1,000 మార్క్‌ను దాటాయి. కేవలం 20 రోజుల్లోనే వెయ్యికిపైగా కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు తెలిపారు. గతేడాది జూన్ గణాంకాలతో పోలిస్తే ఇది రెట్టింపుగా ఉందని అధికారులు చెప్పారు.

అంతేకాదు బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్‌కి కూడా డెంగ్యూ సోకింది. గిర్నాథ్‌కు శుక్రవారం నుంచి తేలికపాటి జ్వరం ఉంది. కానీ ఆయన పనికి వెళ్లడం కొనసాగించారు. ఆ క్రమంలో ఫ్రీడం పార్క్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వైద్యుల సలహా మేరకు శనివారం డెంగ్యూ పరీక్షలు చేయించుకోగా పాజిటివ్ అని తేలింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉంది.

చల్లని గాలులతో సహా ఈ ప్రాంతంలోని తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ డెంగ్యూ కేసులు పెరిగాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూ నియంత్రణకు కృషి చేస్తున్నామని బెంగళూరు బీబీఎంపీ అధికారులు తెలిపారు. ఇందుకోసం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ సర్వేలు నిర్వహించి దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరులో గత ఆరు నెలల్లో 2447 డెంగీ కేసులు నమోదవగా, అందులో గత మూడు వారాల్లోనే 1036 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 1,272 కేసులు నమోదయ్యాయి.

ఇటీవల మహదేవపురా, ఈస్ట్ జోన్లలో అత్యధిక సంఖ్యలో కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా నివసిస్తుంటారు. ఈ నేపథ్యంలో దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే రాబోయే రోజుల్లో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉంది. కాబట్టి ఫీవర్, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ఛాన్స్ ఉంటుంది.

# కొత్త స్పీకర్ ఓం బిర్లాకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



**( పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ ) :** వరుసగా రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్‌డీఏ అభ్యర్థి ఓం బిర్లా ఎన్నికైన ఆయనకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. "18వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు అభినందనలు. మన పార్లమెంటరీ సంప్రదాయాలను నిలబెట్టి, చిత్తశుద్ధితో, విజ్ఞతతో సభను నడిపించడంలో ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు.

# జనాలకు మొఖం చూపించుకోలేక జగన్ కుయుక్తులు : ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి



**కడప ( జర్నలిస్ట్ ఫైల్ ):** జగన్ జనాలకు మొఖం చూపించుకోలేక కుయుక్తులకు తెరలేపాడని.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ స్పీకర్ కు లేఖ రాస్తున్నారని ఎమ్మెల్యే ఆర్.మాధవి రెడ్డి అన్నారు. అధికారం ఉంటనే అసెంబ్లీలోకి అడుగుపెడతారా అని ఆమె ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చి నియోజకవర్గ సమస్యలపై గళమెత్తకుంటే గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఏమని సమాధానం చెబుతారని మాధవిరెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. మాధవి రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్ కు లేఖ రాయడం చూస్తే ఆయనకు రాజ్యాంగంపై ఎటువంటి అవగాహన లేదని స్పష్టం అవుతోందన్నారు. మొత్తం సభ్యుల్లో 10% ప్రతిపక్షానికి ఉండాల్సిన అవసరం లేదని లేఖ రాయడమే దీనికి ఉదాహరణ అని అన్నారు. రూల్ నెంబర్-56 క్లాజ్ నెంబర్ 'సి' లో క్లియర్ గా రాశారని వెల్లడించారు. మొత్తం సభ్యుల్లో 1/10 వంతు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందని తెలిపారు. స్పీకర్ ఎన్నిక రోజు కూడా వైసీపీ నేతలు ఒక్కరు కూడా అసెంబ్లీకి రాలేదని, దాచుకోవడం, దోచుకోవడానికి తప్ప ప్రజా సేవకోసం వచ్చిన పార్టీ వైసీపీ కాదని ప్రజలు గమనించారని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ పద్మశ్రీ, రాకేష్ రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు





● క్రమశిక్షణ కమిటీ ఎక్కడ ఉంది అంటూ ప్రశ్నిస్తున్న పద్మశ్రీ, రాకేష్ రెడ్డి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో వివాదం రోజురోజుకి ముదురుతోంది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధిష్ఠానం నుంచి వచ్చిన నిధుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా, ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్ అవినీతికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ పద్మశ్రీ, రాకేశ్ రెడ్డి ఆరోపణలు చేశారు. దీంతో ఏపీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దీనిపై వివరణ ఇవ్వాలంటూ తాజాగా వారికి పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించింది.

నోటీసులకు సమాధానంగా పద్మశ్రీ, రాకేశ్ రెడ్డి ఓ లేఖను పంపించారు. ఏపీలో ఈనెల 20న పార్టీకి చెందిన అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు షర్మిల ప్రకటించారని, అన్ని కమిటీలు రద్దు చేసినప్పుడు క్రమశిక్షణ కమిటీ కూడా రద్దు అవుతుందని లేఖలో తెలిపారు. నోటీసుల్లో పేర్కొన్న విధంగా వివరణ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నా ఎవరికి ఇవ్వాలో అయోమయంలో ఉన్నామని ఎద్దేవా చేశారు. మ్నెదట తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని పద్మశ్రీ, రాకేశ్ రెడ్డి లేఖలో డిమాండ్ చేశారు.

# మహిళను చంపిన చిరుత

**నంద్యాల ( జర్నలిస్ట్ ఫైల్ ):** నంద్యాల-గిద్దలూరు ఘాట్ రోడ్డులో మహిళలపై చిరుత దాడి చేసి చంపేసింది. కట్టెల కోసం అడవిలో వంక వద్దకు వెళ్లిన షేక్ మెహరున్నిసా పై చిరుత దాడి చేసింది. షేక్ మెహరున్నిసాను చంపి తలను తినేసినట్లు స్థానికులు చెబుతున్నారు. షేక్ మెహరున్నిసాపై చిరుత దాడి చేయడంతో కేకలు వేసిందని, ఆ కేకలు విన్న స్థానికులు వంక వద్దకు వెళ్లేసరికి చిరుత అప్పటికే చంపేసిందని గ్రామస్తులు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం కూలీ షేక్ బీబీపై కూడా చిరుత దాడి చేసి గాయపరిచింది. అటవీ అధికారులు చిరుతను పట్టుకోవడానికి 10 కెమెరాలు, 2 బోన్లు ఏర్పాటు చేశారు.

# ఆర్అండ్‌బీ రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు

● ప్రస్తుతం 9వేల 80 కి.మీల రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి.
● వాటిలో 8వేల 161 కి.మీల రోడ్లకు తక్షణ మరమ్మత్తులు అవసరం
● రూ.2153 కోట్లతో 5731 రాష్ట్ర,జిల్లా ప్రధాన రోడ్లకు ప్రత్యేక మరమ్మత్తులకు చర్యలు
● సిఆర్ఐఫ్ కింద రూ.1959 కోట్లతో 1605 కి.మీల పొడవున 115 పనుల పురోగతి
● 2014-19 సం.లో ఆర్ అండ్ బి కు 14,970 కోట్లు కేటాయిస్తే 12,064 కోట్లు ఖర్చు చేశారు
● గత ప్రభుత్వం 2019-24లో 19,428 కోట్లు కేటాయించి 9,015 కోట్లే ఖర్చు చేశారు.
● రాష్ట్ర రోడ్లు భవనాలు, శాఖా మాత్యులు బిసి జనార్ధన్ రెడ్డి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు నిర్వహించి గుంతలు లేని రోడ్లుగా చేయడమే తక్షణ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు,పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా బిసి జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో వేద పండితుల వేద ఆశ్వీర్వచనాల మధ్య పూజా కార్యక్రమం అనంతరం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2014-19లో ఆర్ అండ్ బి శాఖకు బడ్జెట్లో రూ. 14 వేల 970 కోట్ల రూపాయలు కేటాయిస్తే రూ. 12 వేల 64 కోట్లు అనగా 80 శాతం ఖర్చు చేసి రోడ్లను బాగు చేయడం జరిగిందన్నారు. అదే గత ప్రభుత్వ హయాం 2019-24లో ఆర్ అండ్ బి కి రూ. 19వేల 428 కోట్లు బడ్జెట్ ల్లో నిధులు కేటాయించి కేవలం రూ. 9 వేల 15 కోట్లు అనగా 46శాతం మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. అంతేగాక గత ప్రభుత్వంలో జరిగిన రూ. 2 వేల 261 కోట్లకు బిల్లులు చెల్లించ లేదని దానివల్ల పనులు చేసినా కాంట్రాక్టర్లు చాలా ఇబ్బంది పడుతున్నారని ప్రస్తుతం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని మంత్రి జనార్ధన రెడ్డి పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 8164 కి.మీల జాతీయ రహదార్లు, 12,653 కి.మీల రాష్ట్ర రహదార్లు, 27,062 కి.మీల ముఖ్య జిల్లా రహదార్లు, 5663 గ్రామీణ రహదార్లు కలిపి మొత్తం 53వేల 542 కి.మీల రహదార్లు ఉండగా వాటిలో 45,378 కి.మీలు రాష్ట్ర పరిధిలోనే ఉన్నాయని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. గత ఐదేళ్ళలో తగినన్నినిధులు మంజూరు చేయని కారణంగా రోడ్లకు మరమ్మత్తులు చేపట్టడం గుంతలు పూడ్చడం జరగలేదని అన్నారు. రహదారుల ప్రాధాన్యాన్ని బట్టి ప్రతి 5 సంవత్సరములకు ఒక్కసారి రోడ్లకు ఒక లేయరు తారుతో ప్రత్యేక మరమత్తుల క్రింద చేయడం జరగాల్సి ఉందని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయని కారణంగా సుమారుగా 22,007 కిలోమీటర్లు రోడ్లకు ప్రత్యేక మరమత్తులు చేయవలసి ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం దాదాపు 9080 కిలోమీటర్ల రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని తక్షణం 8161 కిలోమీటర్లు ప్రధాన జిల్లా రహదార్లు, 3340 కిలోమీటర్ల రాష్ట్ర రహదార్లు ప్రత్యేక మరమత్తులకై ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. దెబ్బతిన్న రహదారులను మరమ్మత్తులు చేపట్టి రోడ్లలో గుంతలు లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జిల్లా అధికారులు నుండి గుంతలను పూడ్చుటకు మరియు అత్యవసర మరమత్తులకు రూ. 284 కోట్లతో ప్రతిపాదనలు వచ్చాయని మంజూరుకు పరిశీలన చేస్తున్నట్టు మంత్రి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రంలో న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహాయంతో రూ. 6400 కోట్లతో 2 ప్రాజెక్టులు మంజూరు కాగా దానిలో 70% న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణము మరియు 30% రాష్ట్ర ప్రభుత్వ వాటా. రూ. 3014 కోట్లతో మొదటి ఫేజ్ క్రింద 13 ప్యాకేజీల్లో పనులు జరుగుతుండగా ఇప్పటి వరకూ రూ. 510 కోట్ల పనులు జరిగాయని మంత్రి జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇచ్చిన అడ్వాన్స్ రుణమును సకాలంలో కాంట్రాక్టర్లకు చెల్లించక పోవడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

అదే విధంగా సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సి ఆర్ ఐ ఎఫ్) స్కీం క్రింద 1959 కోట్ల రూపాయల వ్యయంతో 1605కి.మీ.ల పొడవుతో 115 పనులు జరుగుతుండగా ఇప్పటికే రూ 428 కోట్ల తో 350 కి.మీ.ల.పొడవున 39 పనులు పూర్తి కాగా 1255 కి.మీ. పొడవున రూ 1531 కోట్లతో 76 పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. 2023-24లో సి ఆర్ ఐ ఎఫ్ పనుల చెల్లింపునకుగాను కేంద్ర ప్రభుత్వం రూ 483 కోట్లు విడుదల చేస్తే వాటిలో కేవలం రూ 253 కోట్లు మాత్రమే గత ప్రభుత్వం సి ఆర్ ఐ ఎఫ్ పనులకు చెల్లించి సుమారు రూ 230 కోట్లు గుత్తేదార్లకు చెల్లించకుండా ప్రక్కదారి పట్టించడం జరిగిందని మంత్రి జనార్ధన్ రెడ్డి వివరించారు.

సేతు బంధన్ పథకం కింద పది ఆర్వోబిల నిర్మాణానికి 592 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగినది. ఇందులో 5 అర్వోబిల నిర్మాణానికి 351 కోట్ల రూపాయలతో టెండర్ ప్రక్రియ పూర్తి చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు.

ఇతర శాఖలకు సంబందించిన 38 పనులు, 24 న్యాయశాఖ భవనాలు రూ. 1079.44 కోట్లతో మంజూరు కాగా వాటిలో ఒక ఆఫీసు భవనము, 13 డిపోసిట్ పనులు, 11 న్యాయశాఖ భవనములు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు నూతన భవన నిర్మాణము మరియు మరమత్తులకు సంబందించి 1203 పనులు రూ. 875.36 కోట్లుకు మంజూరు కాగా 1051 పనులు పూర్తయ్యాయని మిగతా పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి డా. యువ రాజ్, ఆర్ అండ్ బి ఇఎన్సిలు కె.నయీముల్లా, వేణుగోపాల్ రెడ్డి, సిఇలు శ్రీనివాసులు రెడ్డి, రామచంద్ర, వెంకటేశ్వరరావు, సుకన్య, బుచ్చిరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తాం

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రజలు ఆశించిన మేరకు చేస్తుందని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

రాష్ట్ర సచివాలయం మూడవ భవనం మొదటి అంతస్థులో కుటుంబ సభ్యులతో పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ, గ్రామ సచివాలయ, వాలంటీర్ల శాఖ మంత్రిగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి గారు అప్పగించిన ప్రజా సంక్షేమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని మంత్రి తెలిపారు.

ప్రకాశం జిల్లా శింగరాయకొండలో ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధర్యంలో నడపబడుచున్న డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆర్ట్స్ గ్రూప్ సి.ఈ.సి (80 సీట్స్) తోపాటు ఎం.పి.సి 40 సీట్స్, బైపీసి 40 సీట్స్ అదనంగా మంజూరు చేస్తూ, పైలట్ ప్రాజెక్ట్ క్రింద బాపట్ల జిల్లా నాగులపాలెం బాలికల గురుకుల విద్యాలయంలో పాఠశాల కు సరఫరా చేయబడిన కూరగాయలు, పండ్లు, గ్రుడ్లు మొదలగు సామగ్రి తాజాగా విద్యార్థులకు అందించేందుకు అనువుగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ను మంజూరు చేస్తూ, అదేవిధంగా విద్యార్థులకు వేడి నీటిని అందించేందుకు పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ సౌకర్యం కూడా కల్పిస్తూ మూడు ఫైల్స్ పై మంత్రి సంతకాలు చేశారు. ఈ రెండు పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా రాష్ట్రమంతా వీటిని విస్తరింప చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

షెడ్యూలు తెగలకు చెందిన విద్యార్థులకు ఫీజులు మంజూరు చేయడంలో సాంఘిక సంక్షేమ శాఖ నోడల్ శాఖగా పనిచేస్తుంది అని ఆగిపోయిన ఫీజు బకాయిలను చెల్లించడానికి బడ్జెట్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు.

2023-24 సంవత్సానికి వివిధ పథకాలు ద్వారా ఉన్న బకాయిలను విలేకరులకు మంత్రి వివరించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ల పథకం క్రింద మొత్తం రూ. 2,505.56 కోట్లు ఉండగా ఎస్.సి విద్యార్థులకు రూ. 131.82 కోట్లుబీ వసతి నిర్వహణ రుసుము క్రింద బకాయిలు మొత్తం రూ. 895 కోట్లు ఉండగా ఎస్.సి విద్యార్థులకు రూ. 90.00 కోట్లుబీ హాస్టల్ బిల్స్ మొత్తం రూ. 20.71 కోట్లుబీ పి.ఎం.ఈ.జి.వై పథకం క్రింద రూ. 62.30 కోట్లుబీ ఎన్.టి.ఆర్. విద్యోన్నతి పథకం క్రింద మొత్తం రూ. 1.99 కోట్లుబీ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం క్రింద రూ. 5.69 కోట్లుబీ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం క్రింద రూ. 60.10 కోట్లుబీ ఎస్సీ. ఎస్టీస్ చట్టం మానిటరీ రిలీఫ్ , కులాంతర వివాహాల (ఎస్సీస్) కొరకు మొత్తం రూ. 21.87 కోట్లు స్థూలంగా అన్ని పథకములకు విడుదల కావలసిన మొత్తం రూ. 3,573.22 కోట్లు అని, ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీకి చెందిన బిల్లులు 2019-24 వరకు మొత్తం రూ. 243.34 కోట్లు ఉన్నాయని మంత్రి వివరించారు.

సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని, వికలాంగులకు ప్రత్యేక పాఠశాలలు, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడమే కాకుండా, వారికి జీవనోపాధి కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేస్తామని, వయో వృద్ధుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా రెవెన్యూ సేవలు

● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా ప్రజలకు మెరుగైన సేవలు అందజేయడంలో రెవిన్యూ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశించారు. ప్రతి వ్యక్తికి జననం నుండి మరణం వరకూ పలు రకాల సేవలు అందజేయడంలో కీలక పాత్ర పోషించే రెవిన్యూ అధికారులు, ఉద్యోగులు ఎంతో ఓర్పు, నేర్పుతో ప్రజలకు సేవచేయడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే విషయాన్ని రెవిన్యూ ఉద్యోగులు అంతా గుర్తించాలన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమై పలు ప్రాధాన్యతా అంశాల అమలుతీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ అంశాలకు సంబందించి ప్రజలు ఎక్కువగా సమస్యలను, ఇబ్బందులకు ఎదుర్కోవడం జరుగుతుంటుందన్నారు. అసలు ఎటు వంటి అంశాలు, సందర్భాల్లో ప్రజలు సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందనే విషయాన్ని రెవిన్యూ అధికారులు ముందుగానే గుర్తించి, వాటి శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన ఆదేశించారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్సు సెల్ ను కూడా ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా రెవిన్యూ శాఖలోని మంచి అనుభవం గల అధికారులు తగు సూచనలు, సలహాలు అందజేయాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో అమలు చేయబడుచున్న డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం, రీ సర్వే, రీసర్వే గ్రామాల్లోని ఫైనల్ రికార్డుల స్థితిగతులు, న్యూ సిటిజన్ సర్వీసెస్ అమలు, రెవిన్యూ అధికారులకు అందజేసే సర్వే శిక్షణ, కుల ధృవీకరణ పత్రాల సత్వర జారీకై అనుసరిస్తున్న విధి విధానాలు మరియు ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న పలు ముఖ్యమైన ఫైల్స్ స్థితి గతులు తదితర అంశాలపై సీసీఎల్ఏ జి సాయిప్రసాద్, సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, సీసీఎల్ఏ జి సాయిప్రసాద్, సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ తదితరులతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# మాజీ మంత్రి అనిల్‌పై మహిళ ఫిర్యాదు!



**నెల్లూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఉన్నప్పుడు... జిల్లాల్లోని ప్యాలెస్‌లను తలపించే కార్యాలయాల వ్యవహారం బయటికొస్తున్న తరుణంలో.. నెల్లూరులో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌పై ఓ మహిళ చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలోని జనార్ధన్ రెడ్డి కాలనీలోని తమ భూమిలో అక్రమంగా వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ధైర్యం చేసిన ముస్లిం మహిళ కౌసర్ జాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై అనేకసార్లు అనిల్ కుమార్, వైసీపీ నేతల చుట్టూ తిరిగినా న్యాయం చేయలేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. యజ్దానీ అనే వ్యక్తి నుంచి భూమిని కొనుగోలు చేశామని.. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కౌసర్ రాసుకొచ్చారు.

ఈ నిర్మాణానికి కర్త, కర్మ.. క్రియ మొత్తం అనిల్ కుమారేనని, ఆయనే శంకుస్థాపన చేసిన విషయాన్ని కూడా మహిళ మీడియాతో చెబుతున్నారు. తనకు న్యాయం చేయాలని ఏడాదిన్నరగా పోరాటం చేస్తున్నట్లు కౌసర్ తెలిపారు. ఇప్పుడు వైసీపీ పోయి.. కూటమి ప్రభుత్వం రావడంతో మరోసారి ఫిర్యాదు చేశారామె. పోలీసులు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. పార్టీ కార్యాలయం నిర్మాణం, చుట్టు పక్కల ఉన్న రెండున్నర ఎకరాలు భూమి ఆక్రమించారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. రెండ్రోజులుగా ఇంత రచ్చ జరుగుతున్నా అనిల్ కానీ.. వైసీపీ నేతలు ఒక్కరంటే ఒక్కరూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమం కాదు సక్రమమే అయినప్పుడు అనిల్ ఎందుకు స్పందించట్లేదని సొంత కార్యకర్తల్లో సైతం సందేహాలు వస్తున్న పరిస్థితి. ఈ వ్యవహారంపై ఆయన స్పందిస్తారో.. లేకుంటే మిన్నకుండిపోతారో చూడాలి.

# ఈనెల 28న టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు యాదవ్ బాధ్యతలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఈనెల 28న తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవాహం మధ్యాహ్నం 01:45గంటలకు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహా టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, పలువురు నాయకులు హాజరుకానున్నారు.

గతంలో విశాఖపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగా సమర్థవంతంగా పని చేయడంతో గుర్తించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు.. జూన్ 16న పల్లా శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధికంగా 95,235ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467